మంగళవారం । తెలంగాణ
12 మే 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

మే 20 నుండి 24 వరకు అష్టోత్తర శతకుండాత్మక శ్రీ సుదర్శన సహిత లక్ష్మీనరసింహ స్వామి వారి మహాయాగం

మిర్యాలగూడ మే 11(నినాదం):
మే 20 నుండి 24 వ తారీకు వరకు మిర్యాలగూడ ఎన్ఎస్పి క్యాంప్ గ్రౌండ్ నందు నిర్వహించబోయే అష్టోత్తర శతకుండాత్మక శ్రీ సుదర్శన సహిత లక్ష్మీనరసింహ స్వామి వారి మహాయాగం లో పాల్గొనవలసినదిగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ని సోమవారం అయన క్యాంపు కార్యాలయం లో శ్రీ వెంకటేశ వైభవం అనే ఆధ్యాత్మిక సంస్థ, శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం ఎన్ఎస్పి క్యాంప్, శాంతినగర్ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి సౌభాగ్యలకోసం నిర్వహించే యజ్ఞ కార్యక్రమం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

లాడ్జిలు హోటళ్లపై పోలీసులు మెరుపు దాడులు..

నిర్మల్ ప్రతినిధి, మే 11 (నినాదం):
నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు తమ నిఘాను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ పిలుపునిచ్చిన “నిర్మల్ పోలీస్... మీ పోలీస్” కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న లాడ్జీలు, హోటళ్లపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా డీఎస్పీ శ్రీనివాస్ స్వయంగా క్షేత్రస్థాయిలోకి దిగి, పట్టణ ఇన్స్పెక్టర్ సమ్మయ్య మరియు భారీ పోలీస్ బలగంతో కలిసి ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక సోదాలతో పట్టణంలోని లాడ్జీ నిర్వాహకులలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ తనిఖీల సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో నేరాల నియంత్రణకు మరియు అసాంఘిక శక్తులు ఆశ్రయం పొందకుండా ఉండేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. లాడ్జీకి వచ్చే అతిథుల వివరాల నమోదులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్క కస్టమర్ యొక్క ఒరిజినల్ ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డులను ఫోటో కాపీ తీసుకున్న తర్వాతే గదులు కేటాయించాలని, రిజిస్టర్లలో వారి ఫోన్ నంబర్లు, వచ్చిన ప్రాంతం మరియు వెళ్లే ఉద్దేశ్యాన్ని స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. గదుల్లో బస చేసే వారి ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.
ముఖ్యంగా సీసీ కెమెరాల నిర్వహణపై డీఎస్పీ కఠిన ఆదేశాలు జారీ చేశారు. లాడ్జీల ఎంట్రన్స్, కారిడార్లు మరియు పార్కింగ్ ప్రదేశాలలో హై-డెఫినిషన్ సీసీ కెమెరాలు ఉండాలని, అవి 24 గంటల పాటు రికార్డింగ్‌లో ఉండాలని స్పష్టం చేశారు. రికార్డింగ్ బ్యాకప్ కనీసం 30 రోజుల పాటు భద్రపరచాలని, తనిఖీల సమయంలో కెమెరాలు పనిచేయకపోతే నిర్వాహకులపై భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, హోటల్ గదులను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చవద్దని హెచ్చరించారు. మద్యం సేవించడం, పేకాట ఆడటం, వ్యభిచారం వంటి చట్టవిరుద్ధ పనులకు గదులు ఇస్తే సదరు లాడ్జీల లైసెన్సులను రద్దు చేయాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. మైనర్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద జంటలు వస్తే వారి తల్లిదండ్రుల వివరాలను కూడా సేకరించాలని సూచించారు. ప్రజల రక్షణ కోసం పోలీ సులు నిరంతరం శ్రమిస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణలో వ్యాపారస్తులు, సామాన్య ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని డీఎస్పీ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీ కార్యక్ర మం పట్టణంలోని బస్టాండ్ పరిసరాలు, మెయిన్ రోడ్ మరియు శివారు ప్రాంతాల్లోని పలు హోటళ్లలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

గద్వాల ప్రతినిధి మే 11 (నినాదం)

జోగులాంబ గద్వాల జిల్లా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈరోజు నుంచి విద్యా వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అయిజ మండలం వెంకటాపురం మండల ప్రాథమికోన్నత పాఠశాలలో బాలుర మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణానికి సర్పంచ్ శకుంతలమ్మ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఉప సర్పంచ్ చిన్న భీమన్న, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సులేమాన్, వార్డు మెంబర్లు పాల్గున్నారు

బండి సంజయ్‌ని మంత్రి పదవి నుండి తొలగించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి బెజుగం సుజాత

నిజామాబాద్ ప్రతినిధి, మే 11 (నినాదం) :
బండి సంజయ్ ని మంత్రి పదవి నుంచి తొలగించాలని, బండి భగీరథుని అరెస్టు చేసి జైలుకు పంపాలని ఐద్వా మహిళా సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని ఐద్వా కార్యదర్శి బెజ్జం సుజాత అన్నారు. నిజామాబాద్ జిల్లా ఐద్వా ఆధ్వర్యంలో నాందేవాడ ఆఫీస్ లో సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే మహిళలకు రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. రోజురోజుకీ హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. హైదరాబాద్ లో జరిగినటు వంటి మైనర్ బాలిక అత్యాచారం కేసు లో బండి భగీరథ ని అరెస్టు చేసి జైలుకు పంపాలి. ఆ కేసును పక్కతోవ పట్టించడం కోసం హనీ ట్రాప్ కేసు పెట్టి మైనర్ బాలిక కుటుంబాన్ని బెదిరింపులకు గురి చేస్తూ రూ.50 వేల నగదు ఇస్తామని కేసు నుంచి పక్కకు తప్పుకోమని కుటుంబాన్ని భయప్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నటువంటి బండి సంజయ్ మైనర్ బాలిక కుటుంబాన్ని బెదిరింపులకు గురి చేయడం కరెక్ట్ కాదని అన్నారు. లేదంటే రేపు రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా కూడా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తాం. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అడివాలా అనిత, నగర కమిటీ సభ్యురాలు కె.శ్రీ దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వారోత్సవాలకు బయలుదేరిన ప్రత్యేక బస్సులు

చేవెళ్ల,మే 11(నినాదం):
హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన విద్యా వారోత్సవాల రాష్ట్రస్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న సందర్భంగా చేవెళ్ల మండలం నుంచి పాల్గొనే ఏఏపీసీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ఎంపీడీఓ హిమబిందు, మండల విద్యాధికారి పురాన్ దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, విద్యా కమిటీల సభ్యులు భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకుంటున్న చర్యలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి పాఠశాల అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



కల్లు గీత సహకార సంఘ అధ్యక్షునిగా మదన్ గౌడ్

కల్వకుర్తి మే 11 (నినాదం)
వెల్దండ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో కల్లుగీత సహకార సంఘ ఎన్నికలను ఆప్కారి సహకార సంఘాల ఇన్స్పెక్టర్ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వెల్దండ గ్రామ పంచాయతీకి చెందిన మట్ట మదన గౌడ్ ఏకగ్రీవంగా సహకార సంఘ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా మట్ట విష్ణు గౌడ్ కార్యదర్శిగా కృష్ణయ్య గౌడ్ డైరెక్టర్ గా నిరంజన్ గౌడ్ , ఎన్నిక కావడం జరిగింది. ఈ సంద ర్భంగా గౌడ సంఘం జిల్లా నాయకుడు మట్ట వెంకటయ్య గౌడ్ సమక్షంలో ఎన్నికల అధి కారి మదన్ గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లానాయకులు మట్ట వెంకటయ్య గౌడ్, మట్ట కృష్ణ గౌడ్ ఆంజనేయులు చంద్రకాంత్ గౌడ్ నాగయ్య పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు
- ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాల ప్రారంభం
- అదనపు తరగతి గదులను ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే

గద్వాల బ్యూరో మే 11(నినాదం)
విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందని, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా సోమవారం నుంచి విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే క్యారమ్స్, చెస్, నృత్యం, హ్యాండ్ రైటింగ్, చిత్రలేఖనం, తదితర అంశాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే ధ్యేయంగా విద్యా వారోత్సవాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఇవ్వడమే కాక జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించడమే ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు చెప్పారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆయా పాఠశాలల్లో, కళాశాలలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడమే కాక పూర్తయిన నిర్మాణాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తూ ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, పిఎసిఎస్ చైర్మన్ సుభాన్, స్థానిక కౌన్సిలర్ బంగి ప్రియాంక, డీఈవో విజయలక్ష్మి, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, పాఠశాల జిహెచ్ఎం రేణుకా దేవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రాధాన్యం

జిల్లా ఎస్పీ డా జి జానకి షర్మిల ఐపీఎస్



నిర్మల్ ప్రతినిధి, మే 11 (నినాదం):
బాధితులకు భరోసా కల్పిస్తూ, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ‘గ్రీవెన్స్ డే’ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ స్వయంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. “నిర్మల్ పోలీస్... మీ పోలీస్” అనే నినాదంతో ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు ఈ కార్యక్రమాన్ని వేదికగా చేసుకున్నారు.

బాధితుల ముందే అధికారులకు ఆదేశాలు:
నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే ఎస్పీ స్పందిస్తూ, బాధితుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. చట్టపరంగా బాధితులకు అందాల్సిన ప్రతి సాయాన్ని త్వరితగతిన అందిస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగే వరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.పోలీసులపై నమ్మకం కలిగేలా సేవలు: ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు మరియు సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. బాధితులకు పోలీసులు ఇచ్చే గౌరవం, చేసే సహాయం వల్లే పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం మరియు భరోసా కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని, అవి ఏ మేరకు పరిష్కారం అయ్యాయో నిరంతరం సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.

పారదర్శకత - తక్షణ పరిష్కారం:
గ్రీవెన్స్ డే అనేది ప్రజలకు, పోలీసు ఉన్నతాధికారులకు మధ్య వారధిగా నిలుస్తుందని ఎస్పీ అభిప్రాయపడ్డారు. నేరుగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం జరగకుండా ఉండేలా ప్రత్యేక ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని, పారదర్శక విధానంలో బాధితులకు సత్వర న్యాయం చేకూరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది మరియు ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

నిర్మల్ ప్రతినిధి, మే 11 (నినాదం):
ప్రజావాణి ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు సమర్పించే వినతులను ఏమాత్రం జాప్యం చేయకుండా, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు మరియు భూ సంబంధిత సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అధికారుల మధ్య సమన్వయం ఉంటేనే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని, సిబ్బంది విధిగా కార్యాలయ సమయాలను పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ లోనే నిర్వహించిన ధాన్యం సేకరణ మరియు రవాణా సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వరి ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, కేంద్రాల్లో ఎక్కువ కాలం నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రానున్న రోజుల్లో ధాన్యం రాక పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అదనపు లారీలను సిద్ధం చేసుకోవాలని, లోడింగ్, అన్‌లోడింగ్ పనుల కోసం సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజూ ధాన్యం తరలింపు వివరాలను నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో జిల్లాలో ప్రారంభమవుతున్న విద్యా వారోత్సవాలపై కలెక్టర్ మాట్లాడుతూ.. ‘ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక’లో భాగంగా మండల ప్రత్యేక అధికారులు ఈ వారోత్సవాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న నిర్వహించనున్న ‘లైబ్రరీ డే’ సందర్భంగా అధికారులు పెద్ద ఎత్తున పుస్తకాలను వితరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు బి. వెంకటే శ్వర్లు, కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు మరియు ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి

కోహెడ, మే 11 (నినాదం) :
కోహెడ మండల కేంద్రంలోని బాడుగుల చెరువు, ఊరగుట్ట ప్రాంతాల్లో ఉన్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వరి కోతలు పూర్తై నెల రోజులు గడిచినా రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉండిపోయిందని ఆయన తెలిపారు.మద్దతు ధరలో ?20 తగ్గించినప్పటికీ కొనుగోళ్లు ఎందుకు వేగవంతం కావడం లేదని ప్రశ్నించారు. ఏ గ్రేడ్ వడ్లను బీ గ్రేడ్‌గా చూపిస్తూ మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తాలు, మట్టి బిళ్లు, అవుట్‌టర్న్, వెయిట్ లాస్ పేర్లతో అనేక రకాల కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. 41 కిలోల 100 గ్రాములు, 200 గ్రాములు వరి జోకినా తక్కువ బరువు వస్తోందని మిల్లర్లు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.ఐకేపీ కేంద్రాల్లో అధికారుల తూకాలకు తాళాలు వేసి, మిల్లర్ల తూకాలకు మాత్రం అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. తూకాల్లో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు నష్టపోతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.లారీల కొరత కారణంగా మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ చేయడానికి ఒక్కో లారీకి మూడు రోజుల వరకు సమయం పడుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యలను అధికారులు వెంటనే గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారి (ఐజూరా)తో ఫోన్‌లో మాట్లాడినట్లు డాక్టర్ శంకర్ తెలిపారు. వర్షాలు వచ్చే పరిస్థితులు ఉన్నందున ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన డీసీఎస్ఓ సిద్దిపేట జిల్లాలో రోజుకు 5 నుంచి 6 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. జిల్లాలోని 420 ఐకేపీ కేంద్రాల్లో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని వెల్లడించారు.లారీలు అందుబాటులో లేని చోట ట్రాక్టర్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపినట్లు చెప్పారు. కోహెడ గ్రామానికి చెందిన కొందరు రైతులు డీసీఎం వ్యాన్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని, ఈ రవాణా చార్జీలు ముందుగా రైతులే భరించాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు తెలిపారని రైతులు వెల్లడించారు.వర్షాల ముప్పు నేపథ్యంలో రైతుల ధాన్యం తడవకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డాక్టర్ వేల్పుల శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకుతో కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గుర్తింపు

కోహెడ, మే 11 (నినాదం) :
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మరోసారి ప్రతిభను చాటుకుంది. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థి ఈ. ప్రదీప్ 500 మార్కులకు గాను 490 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు పొందడంతో కళాశాలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అదేవిధంగా జిల్లా స్థాయిలో కళాశాల ద్వితీయ స్థానంలో నిలవడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కళాశాలలో డిజిటల్ క్లాసులను ప్రారంభించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉత్తమ ఫలితాలు సాధించే దుకు కృషి చేసిన అధ్యాపకులను సన్మానిం చారు. సర్పంచ్ బండెల సుజాత బాలకిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులను ఆమె అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కోతి యాదగిరి, వెంకటరెడ్డి, నరేష్, నీరజ, శ్రీనివాస్, చిరంజీవి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ పట్టణంలో డీజేలు నిషేధం

పట్టణ ఎస్సై టి. కె.మల్లేష్

గద్వాల ప్రతినిధి మే 11 (నినాదం)
అయిజ మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా డిజె సౌండ్ వినియోగించరాదని పట్టణ ఎస్ఐ టి.కె.మల్లేష్ పేర్కొన్నారు
అధిక శబ్దంతో డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించడం ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించరాదని, రాత్రి వేళల్లో అధిక శబ్దంతో పెళ్లిళ్లు, మరియు వివిధ కార్యక్రమాల్లో డీజేలు వినియోగించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ డీజేలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. అవసరమైతే డీజే పరికరాలు స్వాధీనం చేసుకోవడం కూడా జరుగుతుంది. ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని, ఏవైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన అన్నారు.